
తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# తిరుమల అదనపు ఎస్పీ శివరామిరెడ్డిపై బదిలీ వేటు



తిరుమల,జూన్ 8(ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల అదనపు ఎస్పీ ఎం.శివరామిరెడ్డిపై బదిలీ వేటు వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన వెంటనే బదిలీ అయి డిజిపి కార్యాలయంలో రిపోర్టుచేయాలని ఆదేశించింది. ఇదివరకే ఈయనపై గతంలో కొన్ని ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. తిరుమలలో ఉన్న ఈయనను తక్షణం రిలీవ్‌చేయాలని ఎస్పీకి డిజిపి కార్యాలయం ఆదేశాలిచ్చింది.

# రేణిగుంట జాయింట్ సబ్ రిజిస్టార్ సస్పెన్షన్

రేణిగుంట, జూన్ 8(ప్రభాతవార్త:

రేణిగుంట జాయింట్ సబ్ రిజిస్టార్ శోభారాణిని సస్పెండ్ చేస్తూ చిత్తూరు రిజిస్ట్రేషన్, స్టాంపులు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ గిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రేణిగుంట సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో సుమారు 21,53,110 లక్షల రూపాయలు స్టాంపులు విక్రయించిన సొమ్ము ప్రభుత్వానికి జమచేయకపోవడంతో ఆమెను సస్పెండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా సబ్ రిజిస్టార్ కార్యాలయంపై ఎన్నో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. రిజిస్ట్రేషన్ విషయంలో కూడా నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు దస్తావేజుల లేఖకులు సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారని, పరిధికి మించి ముడుపులు సమర్పించిన బాధితులు వాపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గతంలో ఒక రిజిస్ట్రేషన్ విషయంలో ఓ వైసిపి నేతకే చేదు అనుభవం ఎదురైంది. ఇదేమి చిత్రం అంటూ ఆయన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోకుండానే వెనుదిరిగారు.

## కాణిపాకం ఆలయంలో

# పోటెత్తిన భక్తుల రద్దీ

### ముగుస్తున్న వేసవి సెలవులతో భారీగా పెరిగిన రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయ క్యూలైన్లు

కాణిపాకం, జూన్ 8 ప్రభాతవార్త:

పాఠశాలలకు వేసవి సెలవులు మరో నాలుగు రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం పోటెత్తిన భక్తుల రద్దీతో జనసంద్రంగా తయారైంది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుం ది. ఈమేరకు శని,ఆదివారాలు ప్రభుత్వ సెలవు రోజులు కావడంతో పాటు ఈనెల 12 నుండి పాఠశాలలు పున: ప్రారంభం కానుండంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు కాణిపాకం స్వామివారి దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడ ంతో ఆలయం వెలుపల బారులుతీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండలు మండుతున్నా గత నాలుగైదు రోజుల క్రితమే వర్షాల పేరుతో మజ్జిగ పంపిణీ కార్యక్రమంను నిలిపి వేయడంతో భక్తులు తీవ్ర

# డిపాజిట్లు గల్లంతే !



## కూటమి, వైసిపి మధ్యే పోటీ

## నామమాత్రపు పోటీలో 43మంది అభ్యర్థులు ఓటమి

తిరుపతి,జూన్ 8(ప్రభాతవార్త:

జిల్లాల పునర్విభజన తరువాత తిరుపతి జిల్లా కేంద్రం, నియోజకవర్గానికి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా 46మంది అభ్యర్థులు పోటీచేసినా, 43మంది డిపాజిట్లు కూడా కోల్పోయారు. తిరుపతిలో కూటమి తరపున జనసేన ,వైసిపి అభ్యర్థుల మధ్యే పోటీ జరిగింది. వారికి దరిదాపుల్లో కూడా ఇతర పార్టీల ,స్వతంత్ర అభ్యర్థులు ఓట్లు సాధించలేకపోయారు. కూటమి అభ్యర్థిగా జనసేన నుండి పోటీచేసిన ఆరణి శ్రీనివాసులు 60,255ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డికి 52,236ఓట్లు వచ్చాయి. తిరుపతి అసెంబ్లీలో మొత్తం ఓటర్లు 3,02,503 మంది కాగా గత మే 13న జరిగిన పోలింగ్‌లో 1,91,557మంది ఓటర్లు తమ ఓటు వేశారు. జిల్లాలోనే అనూహ్యంగా ఏ నియోజకవర్గంనుండి పోటీచేయని రీతిలో తిరుపతిలో 46మంది పోటీకి దిగారు. బరిలో నిలిచిన అభ్యర్థుల్లో 43మంది డిపాజిట్లు కోల్పోవడం విశేషం. స్వతంత్రులను కూడా వైసిపి బినామీలుగా పోటీచేయించిందనే ఆరోపణలు వినిపించాయి. సార్వత్రిక ఎన్నికల్లో కొందరు స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీల అభ్యర్థులు ఏకంగా ప్రత్యేక వాహనాలు పెట్టి మరీ ప్రజలను ఆకట్టుకునేలా విస్తృత ప్రచారం చేశారు. అందుకు ఎన్నో రాజకీయ కారణాలు లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. 46మంది పోటీ వెనుక కూటమి పార్టీలు టిడిపి, బిజెపి,జనసేన పార్టీలకు చెందిన ఓటు బ్యాంకు చీల్చడమే ధ్యేయంగా చూసినా, కూటమి అభ్యర్థి ఓట్లు శాతం భారీగానే కాపాడుకోగలిగారు. ఇంత తతంగం చేసినా కనీసం ఓటుబ్యాంకు దరిదాపుల్లోకి లేకపోయారు. అసెంబ్లీ నియోజకవర్గానికి జనరల్ అభ్య ర్థులు 10వేల రూపాయలు, రిజర్వు అభ్యర్థులు 5వేల రూపాయలు డిపాజిట్ చెల్లించారు. కాంగ్రెస్ కూటమి నుండి సిపిఐ అభ్యర్థి పి.మురళి పోటీచేసినా కేవలం అతితక్కువ శాతం ఓట్లుతో డిపాజిట్లు దక్కలేదు. ఇలా తిరుపతి నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో 46మంది పోటీచేయడం కూడా తొలిసారే. అందరూ డిపాజిట్లు దక్కించుకోలేకపోయారు.

# మోటారుసైకిల్‌ను ఢీకొన్న లారీ

## ఒకరి మృతి- మరొకరికి తీవ్రగాయాలు





మృతిచెందిన మోథీక్, గాయపడ్డ నవీన్

నారాయణవనం, జూన్ 8 ప్రభాతవార్త :

పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండల పరిధి స్థానిక వేదవ్యాస డిగ్రీ కళాశాల ఎదురుగా శనివారం రాత్రి 8.45 గంటలకు ముందు వెళుతున్న మోటారుసైకిల్‌ని వెనుక వైపు నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రగాయాలకు గురయ్యారు. పుత్తూరు మండలం వీరప్పరెడ్డిపాలెం ఆదిఆంధ్రవాడకు చెందిన నవీన్(21), మోదీక్(21)లు నారాయణవనం నుంచి స్వగ్రామానికి వెళుతుండగా చెన్నై నుంచి పుత్తూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోథీక్‌కు, నవన్‌కు తీవ్రగాయా లయ్యాయి. వారిని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మోదీక్ మృతి చెందాడు. నవీన్‌ను మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతి రుయాసుపత్రికి తరలించారు. లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# టిడిపి నేత ఇంటిపై గుర్తు తెలియని దుండగుల దాడి

## ఏడుమందిపై కేసు నమోదు

శ్రీరంగరాజపురం, జూన్ 8 ప్రభాతవార్త :



విచారిస్తున్న డిఎస్పీ

తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకుడు గంధమనేని రాజశేఖరనాయుడు ఇంటిపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఇంట్లో ప్రవేశించడానికి ప్రయత్నం చేసి వస్తువులను ధ్వంసం చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. విషయం తెలిసిన ఎస్‌ఐ కుల్లాయప్ప సిఐకు సమాచారం అందించి రాజకీయ వ్యవహారం కావడంతో నగరి డిఎస్పీకి సమాచారం తెలిపారు. శనివారం డిఎస్పీ సంఘటనా స్థలానికి చేరుకుని రాజశేఖరనాయుడు కుటుంబ సభ్యులను విచారించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ రాజశేఖరనాయుడు ఫిర్యాదు మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వీరి కుటుంబానికి రక్షణ కల్పించామని తెలిపారు. ఇరువర్గాలు సమన్వయం పాటించాలని తెలిపారు. స్థానికుల కథనం మేరకు... క్షీరసముద్రం గ్రామం చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారి వద్ద వున్న జయశంకర్‌నాయుడు అన్న అయిన రాజశేఖర్‌నాయుడు ఇంటిపై అర్ధరాత్రి 11 గంటల సమయంలో సుమారు 120 మంది గంగాధర నెల్లూరు టిడిపి మాజీ సమన్వయకర్త చిట్టిబాబు అనుచరులు రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఈ ఘటనలో రాజశేఖరరెడ్డి ఇంటిపై రాళ్లు రువ్వడంతో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. దీంతో రాజశేఖరనాయుడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్.ఆర్.పురం ఎస్‌ఐ కుల్లాయప్ప తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని లాఠీ ఛార్జ్ చేయడంతో చిట్టిబాబు అనుచరులు పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు నవీన్ చౌదరి, శబరి, రవినాయుడు, శేఖర్ రాజు, ప్రతాప్ కంట, వాసు, బొజ్జయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

# భక్తుల భద్రత..నేరనియంత్రణ అవశ్యం

## సేవాభావంతో విధులు : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



తిరుమల,జూన్ 8(ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు నిత్యం లక్షలాదిమంది భక్తులు వస్తున్నారని, వారిపట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు హితవు చేశారు. భగవంతుని సన్నిధిలో విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవచేయడం ఆ స్వామివారికి సేవచేసినట్లేనని భావించాలన్నారు. తిరుమలలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా, హుందాగా వ్యవహిరంచాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో శనివారం ఉదయం తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుమలకు విచ్చేశారు. తిరుమలలో నేరాల నియంత్రణ, భక్తుల భద్రతపై స్పష్టమైన నిర్ధేశాలు చేశారు. తిరుమల అదనపు ఎస్పీ శివరామిరెడ్డి, తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావు,డిఎస్పీలు వెంకటాద్రి,శ్రీనివాస ఆచారి, రవీంద్రారెడ్డి, తిరుమల 1టౌన్ సిఐ విజయకుమార్, 2టౌన్ సిఐ సత్యనారాయణ ,ఎస్‌ఐలు పాల్గొన్నారు.



## విద్యుత్‌షాక్‌కు గురై హెల్పర్ మృతి

## అభయ వెంకటేశ్వరునికి అలంకారాలు: శనీశ్వరునికి విశేషాభిషేకాలు:



2,4 లో

# మాస్టర్ ప్లాన్ ముందుకు సాగేనా?

## అధికారుల్లో కానరాని చిత్తశుద్ధి? రెవెన్యూ, దేవాదాయశాఖల మధ్య సమన్వయ లోపం

**శ్రీకాళహస్తీశ్వరాలయాభివృద్ధికి భక్తులు భక్తి భావంతో సమర్పించిన కానుకలను మాస్టర్ ప్లాన్ అమలు పేరుతో సుమారు రూ.వంద కోట్లు భూసేకరణకు కేటాయించారు. 2016లో పప్పు బెల్లాల్లా 99 మంది బాధితులకు పంచిపెట్టారు. అయితే ఆరు మంది తమకు పరిహారం చాలదంటూ మొండికేసారు. నలుగురిని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి ఒప్పించారు. మిగిలిన ఇద్దరి సమస్య ఇంకా పరిష్కరింపబడలేదు. దేవాదాయశాఖ, రెవెన్యూల మధ్య సమన్వయ లోపం శాపంగా మారింది.2017లో తెలుగుదేశం హయాంలో మాస్టర్ ప్లాన్‌కు ప్రణాళిక రూపకల్పన చేసారు. ఐదేళ్ళలో కమిటి నియామకం పేర కాలయాపన జరిగింది. ప్రస్తుతం మళ్ళీ తెలుగుదేశం అధికారం చేపట్టింది.ఇప్పటికైనా ఈ ఫైల్‌కు మోక్షం లభిస్తుందా? వేచి చూడాలి.**

శ్రీకాళహస్తి,జూన్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం పరిసరాలను చక్కగా తీర్చి దిద్దుటకు రాబోవు 50 సంవత్సరాల పాటు వచ్చే భక్తులకు సదుపాయాల కల్పనకు 2017లో ప్రణాళిక రూపకల్పన చేసారు. మాస్టర్ ప్లాన్ పేరుతో ఆలయానికి సంబంధించిన నిధులు సుమారు రూ.100కోట్లతో 3.54 ఎకరాల స్థలాన్ని సేకరించారు. అయితే అధికారులు, రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో ఓ మహత్తర ప్రాజెక్టు సుమారు 8 సంవత్సరాలుగా అమలుకు నోచుకోవటం లేదంటే చిత్తశఉద్ధి ఏమిటో అర్థమౌతుంది. ఈ మాస్టర్ ప్లాన్ అమలుకు సంబంధించి 99 మంది భాధితులుగా గుర్తించారు. వారిలో అందరికి నష్టపరిహారంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసారు. అయితే సన్నిధివీధిలోని కొందరు వాణిజ్య సముదాయాలకు చెందిన వారు నష్టపరిహారాలకు సంబంధించి అభ్యర్థించారు. కోర్టుకు వెళ్ళారు. అయితే సమయస్ఫూర్తితో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారితో చర్చించారు. పరిహారాలకు సంబంధించి పరిష్కరించారు. అయితే రెండు లాడ్జిలకు సంబంధించిన అంశం పెండింగ్‌లో ఉంది. నాలుగు సంవత్సరాలుగా ఈ రెండుభవనాలకు సంబంధించిన సమస్యను అధకారులు పరిష్కరించలేకపోతున్నారు .తప్పని సరి భూసేకరణకు సంబంధించి దేవాదాయశాఖ





ఉత్తర్వులు కూడా జారి చేసింది. కానీ కలెక్టర్ స్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అది జగరటం లేదు.

### చెక్ రెడి కాని చొరవ ఎక్కడ?

శ్రీకాళహస్తీశ్వరాలయం అమలు చేసే మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి రామసేతు వంతెన వద్ద ఓ లాడ్జి ఉంది. అయితే ఈ లాడ్జిలో సుమారు 24 అడుగులు మాత్రమే దేవస్థానం సేకరించింది. వారికి రూ. 2కోట్ల నష్టపరిహారం చెక్కును సిద్దం చేసారు. అయితే చెక్కును అందించే సమయంలో డాక్యుమెంట్ల వివాదం చోటు చేసుకుంది. భవనానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు దేవస్థానంకు సమర్పిస్తే ఏదైనా అవసరమైతే ఎలా అని ఓ ఉద్యోగి సలహా ఇవ్వటంతో భవన యజమాని వెనక్కు వెళ్లారు. తరువాత దేవస్థానం ఈ భవనంలో ఉన్న బ్యాంకును ఎంత కాలంలో ఖాళీ చేయించిస్వాధీనం చేస్తారో 'అఫిడివిట్'ను ఇవ్వాలని దేవస్థానం కోరటంతో ఈ సమస్య మొదటికి వచ్చింది. దాంతో ఇంటి యజమాని మాయమయ్యాడు. ఏడాదిన్నర గడచినా అతీగతి లేదు. ఇక మరో భవనం యజమాని తనకు నష్టపరిహారాన్ని నేటి కొత్త ఎస్ ఎస్ ఆర్ ప్రకారం ఇవ్వాలని మొండికేశారు. ఆతను వృత్తి రీత్యా న్యాయవాది కావటంతో చట్టం గురించి మాట్లాడుతున్నారు. ఈ సమస్యను దేవాదాయశాఖ అధికారులు ఏడేళ్ళుగా పరిష్కరించటం లేదంటే వారి చిత్తశుద్ధి అర్థమౌతుంది. ఈ సమస్యకు సంబంధించి రెవెన్యూశాఖ అధికారులు తప్పని సరి సేకరణకు నిర్ణయం తీసుకోవాలి. కానీ జిల్లా మారటంతో సమస్య అటకెక్కింది. ఇలా అయితే మాస్టర్ ప్లాన్ మరో పాతికేళ్ళు గడచినా పూర్తి కాదేమో? ఓ వైపు ఇక్కడ అధికారుల నిర్లక్ష్యం మరో వైపు ద్రోణ కన్సల్టెన్సి నాన్పుడు వ్యవహారంతో 'మాస్టర్ ప్లాన్ మాటలకే పరిమితం. భక్తుల సొమ్ము వంద కోట్లు బూడిదలో పోసిన పన్నీరే నా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## కుప్పం ప్రాంత రైతులు..

# రియల్ వ్యాపారుల్లో జోష్ !!

## భూములకు పెరగనున్న డిమాండ్ !!

కుప్పం, జూన్ 8 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న నియోజకవర్గాల్లో ఒకటైన కుప్పం నియోజకవర్గంలోని రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో ఎన్నికల ఫలితాలు ఉత్సాహం తెచ్చాయి. తెలుగు దేశం పార్టీ ఘన విజయం సాధించడంతో పాటు కుప్పం అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా ఎనిమిదోసారి గెలిచి ఈనెల 12న తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో సిఎం ఇలాఖా అయిన కుప్పం నియోజకవర్గంలో భూములకు డిమాండ్ పెరుగుతుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు రైతులు కూడా ఆనందభరితుల వుతున్నారు. కుప్పం నియోజకవర్గం ఇటు కర్ణాటక, అటు తమిళనాడు రాష్ట్రాలకు మధ్యలో ఉన్న నేపథ్యంలో రవాణా కేంద్రంగా, వాణిజ్య, ఉద్యానవన పంటల కేంద్రంగా ఉంది. ఇప్పటికే కుప్పంలో పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రధానంగా కుప్పం నియోజకవర్గం ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో పాటు మున్ముందు ఈ ప్రాంతంలో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు కావడంతో కుప్పంలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణం సైతం ఈ సారి ఖచ్చితంగా చేపడతారని దీంతో భూముల కొనుగోలుకు ఇతర ప్రాంతాలనుంచి వ్యాపారులు వచ్చి ఎగబాకితే మరింత ధరలు పెరుగుతాయని రియల్ వ్యాపారులు భావిస్తున్నారు. గత కొంతకాలంగా స్దబ్దుగా ఉన్న భూములు, ఫ్లాట్ల విక్రయాలు మరలా ఊపందుకుంటాయని రియల్ వ్యాపారులు సంతోషిస్తున్నారు. జాతీయ రహదారి పక్కన భూములు కలిగిన రైతులు, వ్యాపారులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారంపై భారీగానే ఆశలు పెట్టుకున్నారు. అటు చెన్నై, ఇటు బెంగళూరు నగరాలకు కుప్పం దగ్గరగా ఉండడంతో దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి పారిశ్రామిక వేత్తలు కుప్పం ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువస్తారని రియల్ వ్యాపారులు పేర్కొంటున్నారు.






కుప్పం నియోజకవర్గ మ్యాప్

# అమ్మలకు ప్రతిరూపం అమ్మ ఆశ్రమం

## –ఆహ్లాదకర వాతావరణలో వృద్ధుల జీవితం



తొట్టంబేడు, జూన్ 8 ప్రభాతవార్త

సృష్టికి మూలం అమ్మ. అమ్మ అందరినీ లాలించే సమయం లేకపోవడంతో తలరాతను మార్చే బ్రహ్మ ప్రతి ఒక్కరికీ అమ్మను సృష్టించాడు. దివి నుంచి దిగివచ్చిన..భువిలో కనిపించే దేవత అమ్మ., కరుణించే ప్రేమ అమ్మ. చంటిబిడ్డ తన చిట్టిపొట్టి పాదాలతో గుండెలపై తంతుంటే ఆప్యాయంగా హృదయానికి హత్తుకుని..ఏడిస్తే లాలించి..పాలిచ్చి ఓదార్చే..మాతృత్వపు పరిమళాలు వెద జల్లుతూ బిడ్డల భవిత కోసం పరితపించే మాతృమూర్తి 'అమ్మ'. అమ్మ అన్నమాటల్లో ఉన్న పరమార్ధం..ఎంతో మాధుర్యం నేడు కనుమరుగువుతోంది. బిడ్డల లాలన, పాలన చూసి, వారికి గోరుముద్దలు తినిపించి చిట్టిచిట్టి అడుగులు నేర్పించి, పెద్దవాళ్లుగా తీర్చిదిద్దిన అమ్మను నేడు అన్యాయం జరుగుతోంది. రెక్కలొచ్చిన పక్షి ఎగిరిపోయినట్లు నేడు బిడ్డలు కూడా తమ స్వశక్తిమీద, ఉద్యోగాల్లో స్థిరపడిన తర్వాత 'అమ్మ'ను పూర్తిగా విస్మరించడమే కాకుండా వారిని అనాధాశ్రమాల్లో చేరవేస్తున్నారు. నవమాసాలు మోసి..బిడ్డేసర్వస్వంగా భావించి ఆకలిని సైతం దాచుకుని తన కన్నపేగుకు సపర్యలు చేసే అమ్మ. శక్తి ఉడిగిన వయస్సుల్లో దిక్కులేనిదవుతోంది. రెక్కలొచ్చిన పక్షుల్లా బిడ్డలు ఎగిరిపోతుంటే చూసి ఆనందిస్తుందే తప్ప..తాను అనాథ అవుతున్నాన్న విషయాన్ని మాత్రం చేరనీయదు. నేటి బిడ్డల వికృత చేష్టల నడుమ ఆబిడ్డలు చూపిస్తున్న కపట 'ప్రేమ' అనే మాయా దొంతరల మధ్య చిక్కుకుని ఆ తల్లి తల్లడిల్లిపోతోంది. అయినా తన బిడ్డ పదికాలాల పాటు చల్లగా ఉండాలని కనిపించిన దేవుడిని వేడుకుంటుంది..అదే మాతృహృదయం. కానీ మనమేంచేస్తున్నాం? రెక్కలొచ్చిన తర్వాత మాతృమూర్తికి పిడికెడు మెతుకులు పెట్టలేని దౌర్భాగ్యపు స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాం. అమ్మ ఆలనా, పాలనా, అనురాగం, ఆప్యాయతల నడుమ పెరిగి పెద్దవారమై చరమాంకంలో ఆతల్లినే ఒంటిరిని చేస్తున్నాం. రెక్కలు ముక్కలు చేసుకుని తన ప్రతిబింబాన్ని ఉన్నత స్థితికి చేరుస్తున్న 'అమ్మ' వృద్ధాప్యస్థితిలో కడుదుర్భర స్థితిని ఎదుర్కొంటోంది.వృద్ధాప్యంలో కడుపున పుట్టిన బిడ్డల పిడికెడు మమకారం కోసం ఎదురుచూసే తల్లిదండ్రుల వ్యధ వర్ణనాతీతం. అందరు ఉండీ అనాధ శరణాలయాల్లో ఒంటిరి పోరును కొనసాగిస్తూ..తన బిడ్డడు నిండునూరేళ్లు జీవించాలనుకునే తల్లుల వ్యధ నేటి తరానికి కనపడదు..వినపడదు.. మానవ విలువలు మంటగలుస్తున్న నేటి సమాజంలో కన్నపేగు ఆదరణ కోసం తల్లిదండ్రులు చట్టాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితులు దాపురించాయి. తొట్టంబేడు మండలంలోని శివనాథపురం గ్రామంలోని 'అమ్మ అనాధ ఆశ్రమం'లోకి వెళ్లాల్సిందే..గ్రామంలోని ఆశ్రమంకు 2001లో భూమిపూజచేయగా, 2002నుంచి ప్రారంభించారు. ఆశ్రమాన్ని ప్రారంభించాలన్న తలంపుతో ఉపాధ్యాయులు పి.భూలక్ష్మి, పిర్.సరస్వతమ్మలు తమను పెంచి పెద్దచేసిన పి.సరోజనమ్మకు వివరించారు.ముగ్గురు కలిసి ఆశ్రమ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆశ్రమంలో 15మంది అమ్మలు ఉన్నారు. వీరంతా 50సంవత్సరాలు పైబడిన వారే కావడం గమనార్హం. నెల్లూరుజిల్లా వెంకటాచలం, నాయుడుపేట, రాయచోటి, తిరుపతి, బెంగుళూరు, సత్యవేడు, బ్రాహ్మణపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారే. ఆశ్రమంలో ఉన్న వారికి దాతల సహకారంతో ప్రతిరోజు చక్కని భోజనంతోపాటు పాలు, పండ్లు అందిస్తున్నారు.

### ఇష్టంగా చేసేది ఏదీకష్టంకాదు

**..పి.భూలక్ష్మి, ఆశ్రమ నిర్వాహకురాలు**

ఇష్టంగాచేసేది ఏదీ కష్టంకాదని అమ్మ ఆశ్రమ నిర్వాహకురాలు పి.భూలక్ష్మి అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృమూర్తులను పట్టించుకునే వారు కరువయ్యారని, అలాంటి వారిని ఆదరించాలన్నతలంపుతోనే ఆశ్రమాన్ని ఏర్పాటుచేశానన్నారు. అమ్మ ఎప్పటికీ అనాథకాదని పేర్కొన్నారు. ఆశ్రమంలో 'అమ్మ' విగ్రహం ఏర్పాటుచేశామని వివరించారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌షాక్‌కు గురై హెల్పర్ మృతి



కుప్పం, జూన్ 8 ప్రభాతవార్త

మండలంలోని గుడ్లనాయనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ (డిస్కం) పరిధిలో హెల్పర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని అడవిబూదుగూరుకు చెందిన ముత్తుకుమార్ (32) గుడ్లనాయనపల్లి సబ్‌స్టేషన్‌లో గత కొన్నేళ్లుగా ఔట్ సోర్సింగ్ విధానంలో హెల్పరుగా పనిచేస్తున్నాడు. శనివారం సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ నిర్వహించేందుకు గాను సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిపేసి ముత్తుకుమార్ ట్రాన్స్ ఫార్మర్‌ను పరిశీలిస్తున్నాడన్నారు. ఈ నేపథ్యంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలో జనరేటర్ ఆన్ చేయడంతో ముత్తుకుమార్ కిందకు దిగే సమయంలో ఒక్కసారిగా విద్యుత్ తీగల్లో విద్యుత్ సరఫరా కావడంతో ఒక్కసారిగా ముత్తుకుమార్ విద్యుత్‌షాక్ తగిలి మృతు ్యవాత పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు, డిస్క ం అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈవిషయంగా డిస్కం ఎఇ చంద్రశేఖర్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని జనరేటర్ ఆన్ చేయడంతో విద్యుత్ సరఫరా ఒక్కసారిగా రావడంతో ముత్తుకుమార్ మృతి చెందినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

## నారాలోకేష్‌ను కలసిన సుబ్బయ్య



శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జలసు ధీర్‌రెడ్డి సూచనలతో శనివారం విజయవా డలోని ఉండవల్లిలోని ఆయన నివాసంలో తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంగ ళగిరి శాసనసభ్యులు నారాలోకేష్‌ను తిరుపతి పార్లమెంటు యస్‌టి సెల్ అధ్యక్షులు యం.సుబ్బయ్య మర్యాదపూర్వకంగా కలసి ఆయన్ను దుశ్శాలువ పూలమాలతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెమనాయుడును కలసి శివయ్య ప్రసాదాలు అందించారు. ఈసందర్భంగా నారాలోకేష్ మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామాల్లో రాజుకుంటున్న ఇసుక వివాదాలు

### స్వర్ణముఖి పరిసర గ్రామాల్లో ఉద్రిక్తతలు

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని స్వర్ణముఖి పరిసరాల్లో 'ఇసుక అక్రమరవాణా' వివాదాలు రాజుకుంటున్నాయి. దాంతో పలు గ్రామాల్లో ఇప్పటికే వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం గ్రామంలో గతంలో వైకాపా సారధ్యంలో విచ్చల విడిగా ఇసుకను అక్రమంగా రవాణా చేసిన నాయకుడు తన పంథా మార్చుకోలేదు.దాంతో కొందరు తెలుగుదేశం నాయకులు అక్రమరవాణాను అడ్డుకున్నారు. దాంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. చిరవకు హెచ్చరికతో సద్దుమణిగింది.చంద్రగిరి కొండ కొనల్లో పుట్టె స్వర్ణముఖి నది సుమారు 54 కిలో మీటర్లు పయనించి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నది చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని వందలాది గ్రామాలను సస్యాశ్యామలం చేస్తుంది. స్వర్ణముఖి నది తీర ప్రాంతాల్లో వేలాది ఎకరాలు పంటలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని పలు చెరువులకు వర్షాకాలం నీటిని సరఫరా చేస్తుంది. ఇక తీర ప్రాంతాల్లో బోర్లలో భూగర్భ జలాలు విస్తృతంగా ఉండటంతో ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే వారు. అయితే గత ఐదేళ్ళుగా స్వర్ణముఖి నదిలో ఇసుకను దోచేస్తున్నారు.అక్రమంగా పగలు రేయి తేడా లేకుండా తోడేయటంతో భూగర్భ జలాలు అడుగింటి పోతున్నాయి. దాంతో వ్యవసాయానికి బోర్లలో నీరు అడుగింటి పోతుంది. రైతులు ఎవరికి చెప్పుకోవాలో తెలియకు తిక మక పడుతున్నారు.ఈ నేపథ్యంలో మౌనంగా ఉన్న గ్రామస్థులు ప్రస్తుతం ఇసుకను దందా దారులు పాత పద్దతుల్ని మానుకోమంటే అడ్డుకుంటున్నారు. దాంతో వివాదాలు, ఘర్షణలుచోటు చేసుకుంటున్నాయి. మరి రాబోవు రో జుల్లో ఏం జరుగుతుందో వేచి చూడాలి.శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకం ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పదవికి మోహన్‌రెడ్డి నియామకం

కాణిపాకం, జూన్ 8 ప్రభాతవార్త:



సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ పదవికి అగరం మోహన్‌రెడ్డి ఎట్టకేలకు శనివారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా పార్టీ ఘోర పరాజయం పాలవడంతో నైతిక బాధ్యత వహిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం పాలకమండలి సభ్యత్వం, ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు దేవాదాయశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శికి తన రాజీనామా పత్రాన్ని పంపాల్సిందిగా దేవస్థానం ఈఓ వెంకటేశును కలసి అందజేశారు. ఈసందర్భంగా ఈ అవకాశం కల్పించిన గత ప్రభుత్వ పెద్దలకు ఆలయ ఉభయదారులకు కృతజ్ఞతలు తెలిపారు. 2021 అక్టోబర్ 2న ఆలయ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మోహన్‌రెడ్డి రెండేళ్ళు పదవీకాలం పూర్తి చేసుకుని ప్రస్తుతం రెండవ ధపా కొనసాగుతున్నారు.

## చిత్తూరు హల్లో కిడ్స్‌జీనియస్‌కు 'వరల్డ్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అవార్డు'

చిత్తూరురూరల్, జూన్ 8 ప్రభాతవార్త:



చిత్తూరు నగరం, గురునగర్ కాలనీ లోని హల్లో కిడ్స్ జీనియస్ పాఠశాల వరల్డ్ ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అవార్డు 2024కు ఎంపికైనట్లు డైరెక్టర్లు లోహిత్ కుమార్, పవిత్రలోహిత్‌లు తెలిపారు. భారతదేశంలో 900కు పైగా హల్లో కిడ్స్ జీనియస్ బ్రాంచ్‌లు వుండగా అందులో అత్యున్నమైన 15 బ్రాంచ్‌లకు ఈ అవార్డులను బహూకరించడం జరిగిందనీ, అందులో మా బ్రాంచ్ ఎన్నికకావడం చాలా గర్వంగా వుందని పేర్కొన్నారు. కాగా శనివారం గోవాలోని హోటల్ గోవాన్ హెరిటేజ్ నందు బాలీవుడ్, హాలివుడ్ ప్లేబాక్ సింగర్ మిస్ హేమసర్దేశాయి, కామత్ గ్రూప్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టరు రాజ్‌కుమార్ చేతుల మీదుగా డైరెక్టర్లు లోహిత్‌కుమార్, పవిత్ర లోహిత్‌లు ప్రతిష్టాత్మక అవార్డు అందుకొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకబృందం, సన్నిహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## ఉచిత కంటిఆపరేషన్లకు ఇరవై మంది ఎంపిక




కుప్పంరూరల్, జూన్ 8 ప్రభాతవార్త

కుప్పం లయన్స్ క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి అధ్వర్యంలో శనివారం పిఇఎస్ అర్బన్ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వందమంది ఈ శిబిరంకు హాజరు కాగా వైద్యులు వారికి కంటి పరీక్షలు నిర్వహించి ఇరవై మందిని ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. శిబిరంకు హాజరైన వారికి లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్మన్ డా॥ మహేష్ కుటుంబీకులు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి పిజి సెల్వం, కోశాధికారి ప్రసాద్, సభ్యులు చరణ్, కృష్ణమూర్తి, లెనిన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు మాధవన్, గంగాధరం పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఏపీఆర్జేసిలు ఎంఇసి గ్రూపులో ఖాళీలు భర్తీ

### ప్రిన్సిపాల్ శారద భాయ్ చౌదరి



వెంకటగిరి టౌన్, జూన్ 8, ప్రభాతవార్త

వెంకటగిరిలోని ఏపీఆర్జేసి కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఎంఇసి గ్రూపులో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారదబాయ్ చౌదరి తెలిపారు. ఏపీఆర్జేసి సెట్‌కు హాజరై సీట్లు లభించని వారితో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలియజేసారు. పూర్తి వివరాలు కోసం 8712625075 నెంబర్‌కు జూన్ నెల 13వ తేది లోపల సంప్రదించాలని కోరారు.

## పెళ్లకూరు అల్లర్ల ఘటనలో నిందితులకు 14 రోజులు రిమాండ్

నాయుడుపేట (పెళ్లకూరు), జూన్ 8 ప్రభాతవార్త

ఈ నెల 6వ తేదీన రాత్రి పెళ్లకూరు గ్రామంలో టిడిపి నాయకులు విజయులురెడ్డి, రాకేష్‌రెడ్డిలపై విచక్షణారహితంగా దాడి చేసి హత్యాయత్నం చేయబోయారన్న నెపంతో పదిమందిపై పెళ్లకూరు పోలీసులు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితో పాటు మరో తొమ్మిది మంది వైసీపీ కార్యకర్తలు పిలిమిశెట్టి మురళి, వంశీకృష్ణ, అల్లం చంద్రబాబు, సుజిత్, మణి, శ్రీనివాసులు, నాగార్జున, చెంచయ్య, పుట్టయ్యలపై ఎస్‌ఐ శ్రీకాంత్ కేసులు నమోదు చేశారు. వీరిని శుక్రవారం వైద్య పరీక్షల అనంతరం సూళ్లూరుపేట కోర్టుకు తరలించారు. 14 రోజులు రిమాండ్ విధించారు.

## ఈదురు గాలులతో భారీ వర్షం

కోట, జూన్ 8 ప్రభాతవార్త

కోట మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా దాదాపు గంటపాటు కురిసిన వర్షంతో పలు రోడ్లు వర్షపునీటితో నిండిపోయాయి. మరోపక్క ఉరుములు మెరుపులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

## గూడూరు అభివృద్ధి సునీలన్నతోనే సాధ్యం

### – టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నాగార్జున

చిట్టమూరు, జూన్ 8 ప్రభాతవార్త



గూడూరు కూటమి అభ్యర్థిగా విజయదుందుభి మోగించిన డాక్టర్ పాశం సునీల్‌కుమార్ కు తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి యల్లసిరి నాగార్జున శుభా కాంక్షలు తెలిపారు. శని వారం పాశం నివాసంలో పుష్పగుచ్చం అందించి శుభా కాంక్షలు తెలిపిన నాగార్జున సునీలన్నకు అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా పేదలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేసి ఓట్లు వేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే ఐదేళ్లలో గూడూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ పాశం గెలుపునతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# విజయశ్రీ గెలుపుతో మొక్కులు తీర్చుకున్న ఆకుల



నాయుడుపేట, జూన్ 8 ప్రభాతవార్త

సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీ గెలుపుకోసం కృషి చేసిన ఆకుల కుబేరుమణి శనివారం నాయుడుపేట పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో ఉన్న విజయగణపతి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్

### - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, పార్ధసారధి దంపతులు, మాజీ ఎఎంసి ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించిందన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు జాతీయ స్థాయిలో కీలకపాత్ర పోషించనున్నారని తెలిపారు. ఎన్నికల నామినేషన్ నుంచి ప్రచారం వరకు ప్రతి కార్యక్రమం విజయగణపతి దేవస్థానం నుంచే ప్రారంభించామని గుర్తు చేశారు. తమ కుమార్తె విజయశ్రీ గెలుపులో ఆకుల కుబేరుమణి మొక్కుబడి చెల్లించడం, ఎమ్మెల్యే విజయశ్రీ చేతులు మీదుగా101 టెంకాయలు కొట్టడం ఎంతో సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మద్దాలి ప్రసాద్, ఉగ్గుముడి భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, దాము, వెంకటేశ్వర్లు, బాలాజీ, సూరి, సుబ్బారావు, కరీమ్, కొరివి లక్ష్మీనారాయణ, చిట్టిబాబు, జయరామ్, వినుగొండ ధనుంజయ, జూలపాటి మస్తాన్, పసుపులేటి లక్ష్మీపతి, గిరిబాబు, గిండి బాలాజీ, బల్లి ముత్యాలయ్య, మొండెం బాబు, కొరివి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు తప్పవు

### – ఎస్ఐ రహీంరెడ్డి

సూళ్లూరుపేట, జూన్ 8 ప్రభాతవార్త



ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల హడావిడి ముగిసిందని, కాగా ప్రజలు చట్ట వ్యతిరేకంగా ఏదైనా పనులు చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని సూళ్లూరుపేట ఎస్ఐ కోట రహీంరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో గాని, ఇతర ప్రసార మాధ్యమాల్లో రాజకీయంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కులాలను రెచ్చగొడుతూ, ఇతరత్రా ఎలక్షన్లకు సంబంధించిన గొడవలను ప్రేరేపిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సూళ్లూరుపేటలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉందని, దీన్ని క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వ్యాపారులు, ప్రజలు తోడ్పాటు అందించాలని ఆయన సూచించారు. కేటాయించిన సమయాల్లోనే పట్టణంలోని భారీ వాహనాలకు అనుమతి ఉంటుందన్నారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా తోపుడుబండ్లు, ఇతర సామగ్రి ఉంచకుండా సంబంధిత వ్యాపారులే బాధ్యత తీసుకొని పనిచేయాలని కోరారు.

## వైసీపీ మండల అధ్యక్ష పదవికి తంబిరెడ్డి రాజీనామా

నాయుడుపేట, జూన్ 8 ప్రభాతవార్త



నాయుడుపేట మండల వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి రాజీనామా చేశారు. నాయుడుపేట రూరల్ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అపజయం పాలవడం తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తూ తాను మండల వైసీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తాను పార్టీకి దూరం కావడం లేదని, వైసీపీలోనే ఉండి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేస్తానని ఆయన వెల్లడించారు.

## ఆటోబోల్తా-నలుగురికి తీవ్రగాయాలు

నాయుడుపేట, జూన్ 8 ప్రభాతవార్త;

నాయుడుపేట మండలంలోని పండ్లూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఆటోబోల్తాపడి నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సేకరించిన సమాచ్చారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆటో ఓజిలి నుండి ప్రయాణికులతో నాయుడుపేటకు వస్తుండగా మార్గమధ్యంలో పండ్లూరు వద్ద జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తాపడింది.దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న రమణమ్మ,రవిబాబు,వీరస్వామి,సుబ్బయ్యలు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.నాయుడుపేట పోలీసులు కేసునమోదేచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కమనీయంగా శ్రీసీతారాముల కళ్యామహోత్సవం

కోట,జూన్ 8 ప్రభాతవార్త



మండల కేంద్రమైన కోటలోని శ్యామ్ సుందరపురంలో శనివారం శ్రీ అభయ అజనేయస్వామి ఆలయంలో ప్రధమ వార్షికోత్సవం సందర్భంగా ధార్మిక సేవా సంస్థ ఆధ్వరంలో నాయుడు రమణారెడ్డి,సరోజనమ్మ కుటుంభ సభ్యులు ఉభయకర్తలగా ,గ్రామస్థులు, భక్తులు సహాయ సహకారాతో కళ్యాణ మహోత్సవం జరిపించారు. స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవాన్ని దీవి అనంతాచార్యులు అరసి నరేష్ శర్మలు శ్రీవైఖానస ఆగమోక్తంగా నిర్వహించారు. లోక కళ్యాణం కోసం శ్రీ సీతారాముల కళ్యాణమహోత్సవాన్ని ఇక్కడ చేయడం జరిగిందన్నారు.స్వామి వారి కళ్యాణం తిలకించడం ,తీర్ధ ప్రసాదాలు స్వీకరించడం వలన భగవంతుని అనుగ్రహం కలుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో కోనసాయిబాబ, ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి,లక్ష్మీ కవితమ్మ, సుచరిత, తిరుమలశేట్టి కోటీవ్వరరావు, నిర్మలమ్మ, మురళి, తదితరులు పాల్గోన్నారు.

## స్వామివారి ఆశీస్సులతో ప్రశాంత ఓట్ల లెక్కింపు



తిరుమల,జూన్ 8ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తిరుపతి జిల్లాలో ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు నిర్వహించామని, ఆ తరువాత పరిస్థితులు అదుపులో ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. స్వామివారి ఆశీస్సులు, ప్రజలు, అధికారులు, రాజకీయ నేతల సహకారంతో తిరుపతి జిల్లా ప్రశాంతంగా ఉండేలా కార్యాచరణ అమలవుతోందన్నారు. శనివారం ఉదయం కుటుంబంతో కలసి ఎస్పీ శ్రీవారిని దర్శించుకున్నారు.

# ప్రవేశాల ప్రక్రియను పరిశీలించిన తితిదే డిఈఓ


తిరుపతి విద్య, జూన్ 8, ప్రభాతవార్త

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో 2024 - 2025 సంవత్సరానికి గాను తొలి విడత కౌన్సిలింగ్‌లో భాగంగా ప్రవేశాల ప్రక్రియను తితిదే డీఈవో డా. ఎం. భాస్కర్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థినిలతో, తల్లిదండ్రులతో చర్చించి, పారదర్శకంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ప్రతిపాదికన కళాశాలలో జరిగే ప్రవేశాల ప్రక్రియ నంతటిని క్షుణ్ణంగా వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేసి, టిటిడి కళాశాలలో సీటు రావడం పూర్వజన్మ సుకృత ఫలమని, శ్రీవారి అమ్మవారి దీవెనలతో వచ్చిన అవకాశాన్ని విద్యార్థినిలు చక్కగా వినియోగించుకుని తల్లిదండ్రులకు కీర్తిని తీసుకురావాలని, ప్రవేశాల ప్రక్రియనంటిని కళాశాల ప్రిన్సిపాల్ డా.సి. భువనేశ్వరిని అడిగి ఆరా తీశారు. ఈ ప్రక్రియలో సాంకేతిక విభాగంలో సభ్యులైన డా.ఉదయ్, హరీష్‌లు విద్యార్థినులకు తలెత్తే సాంకేతిక సమస్యలన్నింటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కౌన్సిలింగ్ ప్రక్రియ అంతటిని సజావుగా జరిగేలా చూస్తూ ప్రిన్సిపల్ పర్యవేక్షణలో అధ్యాపక, సిబ్బంది సమిష్టిగా కౌన్సిలింగ్ ప్రక్రియ చేపడుతున్నారు.

## మాతమ్మ ఆలయానికి రూ.50వేలు విరాళం

తొట్టంబేడు, జూన్ 8 ప్రభాతవార్త



మండలంలోని దిగువసాంబయ్యపాళెంకు చెందిన తెలుగుదేశం మహిళా నాయకురాలు శనివారం మునిరాజేశ్వరి అలియాస్ చిట్టెమ్మ మాతమ్మ ఆలయానికి రూ.50వేలు విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ నిర్వాహకులకు విరాళాన్ని అందించారు. ఈసందర్భంగా చిట్టెమ్మ మాట్లాడుతూ శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి సూచనల మేరకు శుక్రవారం జరిగే మాతమ్మ జాతరకు ఈ విరాళం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాతమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు చిట్టెమ్మకు దుశ్శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రస్టుబోర్డు సభ్యుల రాజీనామాలు

శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ట్రస్టుబోర్డు సభ్యుడుగా ఉన్న కొండుగారికృష్ణకుమార్, ప్రత్యేక ఆహ్వానితుడుగా ఉన్న పి.మునిచంద్ర, పిసుబ్బరాముగుప్తాలు రాజీనామాచేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు రాజీనామా పత్రాలను ఇఒకు అందజేస్తున్నటన్లు వివరించారు.

## ఘనంగా కోట చంద్ర జన్మదినవేడుకలు


శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ నాయిబ్రాహ్మణసాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్‌మీడియా కన్వీనర్ కోట.చంద్రశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పురపాలక సంఘం 18వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్‌భాషా ఆధ్వర్యంలో జయరాంరావువీధిలో చంద్రశేఖర్‌కు దుశ్శాలువతో సత్కరించి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నెమళ్ళూరుబుజ్జి, చాంద్‌బాషా, కృష్ణమూర్తి, గణేష్, శివ, చంద్ర, మైనార్టీ విభాగం నాయకులు షేక్‌జిలానీ, రియాజ్ మొఘల్ అహ్మద్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

## పులివర్తికి ఘన సన్మానం

చంద్రగిరి, జూన్ 8 ప్రభాతవార్త:



టిడిపి ఎంఎల్‌ఏగా మొదటిసారి చంద్రగిరి పార్టీ కార్యాలయానికి విచ్చేసిన పులివర్తి నానిపై పోటెత్తిన అభిమానులు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించుకున్నారు. టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు భాణాసంచాపేళుళ్ళు, జిందాబాద్ నినాదాలతో ఘనస్వాగతం పలికారు. తెలుగు మహిళలు మంగళహారతులతో స్వాగతించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా గల పార్టీ క్యాడర్ హుటాహుటిన పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఆయన దివంగత టిడిపి నాయకులు గంగపల్లి భాస్కర్, బన్నీ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి అభివృద్ధిపై ఇచ్చిన మాటకు కట్టుబడి వున్నట్లు తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలిపారు. టిడిపి కార్యకర్తలే నా కుటుంబమని అన్నారు.

## ప్రజలకు సేవచేసే భాగ్యం అదృష్టం

-పూతలపట్టు ఎమ్మెల్యేకు యువనేత పాకం శుభాకాంక్షలు

తిరుపతి,జూన్ 8ప్రభాతవార్త:



చిన్నవయస్సులో ప్రజలకు సేవచేసే భాగ్యం కలగడం అదృష్టమని, ఆ నమ్మ కాన్ని యువనేతగా కాపాడుకుని మరింత ఉత్సాహంతో సేవచేయాలని పూతల పట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్‌ను టిడిపి యువనేత పాకం వెంకటేశ్ కలిశారు. ఎమ్మెల్యేగా గెలిచిన మురళీని శనివారం ఉదయం పాకం వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సన్మానించారు.

## దోమలను అరికడతాం రోగాలు రాకుండా చూసుకుంటాం

రేణిగుంట, జూన్ 8 ప్రభాతవార్త:



వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమలు అధిక సంఖ్యలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని దోమల వల్ల రోగాలు రాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో అందరిది అని రేణిగుంట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ కామరాజు అన్నారు. మెడికల్ ఆఫీసర్ ఛత్రప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు తమ సహచార ఉద్యోగులతో రేణిగుంట పట్టణంలోని వివిధ వీధుల్లో శనివారం పర్యటించి ప్రజలకు అంటూ రోగాలపై అవగాహన కల్పించారు. వర్షాలు పడడంతో అనేక చోట్ల నీళ్లు ఉంటాయన్నారు. విలువ ఉన్న నీళ్ళలో దోమలు గుడ్లు పెట్టి అవి లార్వాలుగా మారి దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. అనేక అంటూ రోగాలకు దోమలే కారణమన్నారు. ప్రజలు తమ ఇళ్ళలో పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లోహిత, ఆశ కార్యకర్తలు శంషాద్, లక్ష్మీప్రసన్న, జబీన్, రుక్మిణీ, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.


## తెలుగుదేశం శ్రేణులకు పులివర్తి సుధారెడ్డి సూచ

చంద్రగిరి, జూన్ 8 ప్రభాతవార్త:

చారిత్రాత్మక చంద్రగిరిలో వైసిపికి చెందిన గంజాయి బ్యాచ్‌తో టిడిపి శ్రేణులు జాగ్రత్తగా వుండాలని సూచించారు. వైసిపి ఓటమిని జీర్ణించుకులేని గంజాయి బ్యాచ్ సామాజిక మాధ్యమాలలో గానీ, వ్యక్తిగతంగా గానీ రెచ్చగొట్టే అవకాశం వుందన్నారు. టిడిపి శ్రేణులు క్రమశిక్షణకు మారుపేరన్న ఆమె ఘర్షణలకు దిగవద్దన్నారు. గంజాయి బ్యాచ్ వైసిపి మండల కన్వీనర్ మస్తాన్ ఓ వీడియోను విడుదల చేయడంపై ఆమె తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని ఆమె పోలీసుల దృష్టికి తీసుకెళ్ళారు. గత 5 ఏళ్ళలో చంద్రగిరిని గంజాయికి అడ్డా మార్చేసిన ఘనత వైసిపిదే అన్నారు. చంద్రగిరి మండలంలో హింసాత్మక ఘటనలకు, అల్లర్లకు పాల్పడటం, పోలీసులపై తిరుగబడటం, యువకులపై హత్యాయత్నాలు వంటి దుర్మార్గాలకు పాల్పడిన ఘటనలను గుర్తు చేశారు. తాము గంజాయికి వ్యతిరేకంగా అనేక పోరాటగాలు చేశామని గుర్తు చేశారు. టిడిపికి గానీ, టిడిపి శ్రేణులకు వ్యతిరేకంగా గానీ సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తే సహించబోమని తేల్చిచెప్పారు. సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. దీంతో మస్తాన్ తాను చేసిన తప్పుకు క్షమించమని కోరుతూ మరో వీడియోను పోస్టు చేయడంతో సుధారెడ్డిని కోరడంతో సమస్య సద్దుమణిగింది.

## డైరెక్టర్ పదవికి నాగ సుబ్రహ్మణ్యంరెడ్డి రాజీనామా

రేణిగుంట, జూన్ 8 ప్రభాతవార్త:



రేణిగుంట ప్రాథమిక వ్యవసాయ సంఘం మెంబరు పదవికి శనివారం తూకివాకం మాజీ ఎంపీటీసీ నాగ సుబ్రహ్మణ్యంరెడ్డి రాజీనామా చేశారు. వైసీపీ పార్టీ ఆవిర్భావం నుంచి వైసీపీలోనే కొనసాగుతూ వచ్చిన ఆయన ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందు బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ పార్టీలో చేరారు. చేరినప్పుడు సింగిల్‌విండో మెంబరు పదవికి రాజీనామా చేసి ఉండేవాడనని ప్రభాతవార్త ప్రతినిధికితెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఎన్నికల కమిషన్‌ను గౌరవించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తూ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన తరువాత రాజీనామా చేశామన్నారు. రాజీనామా పత్రాన్ని తిరుపతి విభాగ సహకార శాఖ అధికారికి పంపినట్లు తెలిపారు.

## బొజ్జలబృందమ్మను కలసిన కంటా సుబ్రమణ్యం

.శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త



ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి తల్లి బొజ్జలబృందమ్మను తెలుగుయువత నాయకులు కంటా సుబ్రమణ్యంతోపాటు మిత్రబృందం శనివారం మర్యాదపూర్వకంగా ఊరందూరుగ్రామంలో పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా బొజ్జలబృందమ్మ మాట్లాడుతూ గడచిన సార్వత్రిక ఎన్నికల్లో అందరూ స్వచ్ఛందంగా అహర్నిశలు కష్టపడి మెజారిటీతో సుధీర్‌బాబుని గెలిపించారని శ్రీకాళహస్తి ప్రజల కష్టాలు తీరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో రమణగారిఅనిల్‌బాబు, మొద్దుహేమకుమార్, తిరుమలశెట్టి కిరణ్‌కుమార్, యుగంధర్,రవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నుంచి మధురైకు బస్సు సర్వీసులు

.శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఆర్టీసి డిపో నుంచి మధురైకు డైరెక్టు బస్సు సౌకర్యం ఉందని డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. తిరుపతి డిపో బస్సు శ్రీకాళహస్తిలోసాయంత్రం 5గంటలకు ప్రతిరోజు బయలుదేరి తిరుపతి, వేలూరు, తిరువన్నామలై, తిరుచ్చిమీదుగా మధురైకు బస్సు మరుసటిరోజు ఉదయం 6గంటలకు చేరుతుందనానరు. మధురైలో సాయంత్రం 6గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6గంటలకు శ్రీకాళహస్తి చేరుతుందన్నారు. టిక్కెట్లు ధర రూ.1030గా నిర్ణయించామన్నారు.

# తిరుపతి డివిజన్

## సివిల్ సప్లయ్ మాజీ చైర్మెన్ సైకం జయచంద్రారెడ్డికి ఘన సన్మానం

తిరుపతిరూరల్, జూన్08 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర సివిల్ సప్లయ్ మాజీ చైర్మెన్ సైకం జయచంద్రారెడ్డిని శనివారం ఓటేరు టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపుకు సైకం జయచంద్రారెడ్డి కృషితో పాటు చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సైకం అనుచరులు కూడా టిడిపి అభ్యర్థి గెలుపుకు విస్తృతంగా పనిచేసి పులివర్తి నానిని అఖండ మెజార్టీతో గెలిపించిన విషయం తెల్సిందే. చంద్రగిరి నియోజకవర్గంలో 30 సంవత్సరాలు తర్వాత తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావడంలో సైకం పాత్ర కీలకమైందని ఓటేరు వాసులు పేర్కొన్నారు.

## సిద్దయ్య అంత్యక్రియలకు ఆర్థిక సాయం

తిరుపతిరూరల్, జూన్ 8 ప్రభాతవార్త:



తుమ్మలగుంట మాదిగపల్లికు చెందిన సిద్దయ్య అంత్యక్రియలకు చిత్తూరు జిల్లా టిడిపి ప్రచార కార్యధర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి రూ.5వేల రుపాయాలు ఆర్థిక సాయం చేసి, దాతృత్వాన్ని చాటుకున్నారు. సిద్దయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. ఆకాల మృతి చెందిన సిద్దయ్యకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారని, వారి కుటుంబానికి అండగా ఉంటానని దొడ్ల కరుణ హామీ ఇచ్చారు. ప్రభుత్వ నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాధరాయల్, వరదరాజులు రాయల్, శ్రీనివాసులు, రామానాయుడు, రేవంత్, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామానుజపల్లి సర్పంచ్ లీలారాణిని పరామర్శించిన చెవిరెడ్డి

తిరుపతిరూరల్, జూన్ 8 ప్రభాతవార్త:



రామానుజపల్లి గ్రామ సర్పంచ్ పొట్టేలి లీలారాణిని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. గత కొద్దిరోజులుగా సర్పంచ్ లీలారాణి అనారోగ్యంగా బాధపడుతూ చెన్నై ఎం.జి.ఎం ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటిలో విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం రామానుజపల్లికి వెళ్ళి లీలారాణిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అధైర్య పడవద్దని, ఎల్లవేళల అండగా ఉంటానని సర్పంచ్ భర్త పొట్టేలి రవికుమార్‌కు భరోసా ఇచ్చారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. లీలారాణి పూర్తి ఆరోగ్యవంతురాలై తిరిగి గ్రామ ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఎలాంటి సాయం కావాలన్నా, నిర్భయంగా అడగాలని, నాయకులు, కార్యకర్తల శ్రేయస్సే తనకు ముఖ్యమని తెలిపారు.

## పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్ రాజీనామా

నగరి, జూన్ 8 ప్రభాతవార్త:

నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఏ.తిరుమలరెడ్డి, డైరెక్టర్ నాగరత్నం తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను జిల్లా విభాగ సహకార శాఖ అధికారిణికి వారు అందజేశారు.

## గెలుపు ఆనందంలో స్వీట్లు పంపిణీ

నగరి, జూన్ 8 ప్రభాతవార్త:



సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయదుందుభి మోగించడం, నగరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధి 26వ వార్డుకు చెందిన జిల్లా పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు చిట్టి స్వీట్లు పంచారు. ఓట్లు వేసి తెలుగుదేశం పార్టీని ఆదరించినందుకు వార్డులోని ప్రజలకు ఆయన స్వీట్లు పంచారు.

## యువకులకే దేశా అభివృద్ధి సాధ్యం - రమేష్‌రెడ్డి

రేణిగుంట, జూన్ 8 ప్రభాతవార్త:



గ్రామాల నుంచి దేశం వరకు అభివృద్ధి చేయగల సత్తా యువకులకు మాత్రమే ఉందని రాస్ ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ రాస్ ప్రాజెక్టు కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో సంఘం సభ్యులకు సమాజ శ్రేయస్సుపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో యువకులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఉరకలు వేసే యువ తేజస్సుతో వారు చేసే సేవ నిస్వార్థపూరితంగా ఉంటుందన్నారు. యువకులు మంచి మార్గాలను ఎంచుకుని గ్రామాలతో పాటు దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త నాగేంద్రవర్మ, దత్తత గ్రామాలకు చెందిన 30 మంది యువకులు, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

# గెలుపు ఓటములు సర్వసాధారణం: అరాచకాలతో ఇబ్బంది పెడతారా?

బియ్యపు మధుసూధనరెడ్డి


శ్రీకాళహస్తి,జూన్ 8 ప్రభాతవార్త

ఎన్నికల్లో గెలుపు ఓటములు సర్వసాధారణమని గెలిచినంత మాత్రాన అరాచకాలతో ఇబ్బంది పెట్టడం అవసరమా? అని తాజామాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. శనివారం ఆయన తాడేపల్లి పార్టీ కార్యాలయంలో పార్టీ అధినాయకుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డితో కలసినారు. నియోజకవర్గాల్లో ఆరాచకాలు జరుగుతున్నాయని జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తెచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా మధుసూధనరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో అత్యధిక మెజారిటితో తాను గెలిచినానని అయితే అప్పటిలో తాను ఊరేగింపులు,హంగామాలు చేయలేదన్నారు. తాను ఐదేళ్ళు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించామన్నారు. కానీ ఎందుకో జనం తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారన్నారు. ప్రజల తీర్పును ఎవరైనా రాజకీయాల్లో ఆహ్వానించాల్సిందే. గెలిచిన అభ్యర్థి, ఆయన అనుచరులు వైకాపా కార్యకర్తలకు ఫోన్లు చేయటం ' మీ అంతు చేస్తామని హెచ్చరించటం' వైకాపా వారి ఆస్తులపై విధ్వంసం సృష్టించటం లాంటి అరాచకాలకు పాల్పడటం అవసరమా? అని ప్రశ్నించారు. కొందరు కార్యకర్తలు తమ పార్టీ కార్యాలయం వద్దకు వచ్చి బాణ సంచా కాల్చుటం సమంజసమా? అని మధుసూధనరెడ్డి ప్రశ్నించారు. ఇక ఆలయంలో నిరుపేదలైన స్వీపర్లును తొలగించటం న్యాయమా? అని ప్రశ్నించారు. తాను నిరుపేదలకు ఉపాధి చూపాం తప్ప తప్పు చేయమనలేదని మధుసూధనరెడ్డి స్పష్టం చేసారు.

# నా ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవకే నా జీవితాన్ని అంకితం చేస్తా

**ఖనిజ సంపదను దోచుకున్న వారిపై చర్యలు తప్పవు- కష్ట కాలంలో సమిష్టిగా పని చేసిన వారికి న్యాయం చేస్తా- ఇకపై ఒక్క ఫోన్ చేయండి-అందుబాటులోకి వస్తా -సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**



సత్యవేడు/నారాయణవనం/పిచ్చాటూరు,నాగలాపురం, జూన్ 8 ప్రభాతవార్త : నా ప్రాణం వున్నంత వరకు నా జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తానని సత్యవేడు ఎమ్మెల్యేగా రెండవసారి గెలుపొందిన కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం ఆయన నియోజకవర్గం లోని పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, కెవిబిపురం మండ లాల్లో జరిగిన తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవేడులోని వివింకె కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖనిజ సంపద అయిన ఇసుక, గ్రావెల్, కంకరను విచ్చలవిడిగా దోచుకున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకొనే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి దోచుకున్న సంపదను తిరిగి కక్కించాలని, వారు విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకో వాలన్నారు. తాను అసెంబ్లీలో ఖనిజ సంపదను దోచుకోవడంపై ప్రశ్నించినందుకు అసెంబ్లీ సీటు దక్కకుండా అడ్డుకున్నారన్నారు. అలాంటి సమయంలో తన నిజాయితీని గుర్తించి టిడిపి అధినేత నారాచంద్రబాబునాయుడు సత్యవేడు ఎమ్మెల్యే సీటును ఇచ్చారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇటీవల జరిగిన ఎన్నికల్లో కష్టపడి పని చేసి తనను గెలపించారని కార్యకర్తలను, నాయకులను కొనియా డారు. తనను ఓడించడానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇండిపెండింట్‌గా ఇద్దరిని బరిలోకి దింపి వారికి కోట్ల రూపాయాలను అందించి ఓటును చీల్చారన్నారు. అయినా ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించారన్నారు. ఇకపై నాయకులు, కార్యకర్తలు అందరు ఏకతాటిపైకి రావాలన్నారు. గ్రూపులకు తావు లేకుండా ప్రజలకు సేవ చేయడానికి పని చేయాలన్నారు. భవిష్యత్తులో సత్యవేడులో టిడిపి తప్ప వేరే పార్టీకి అవకాశం ఇవ్వకూడదన్నారు. దీని కోసం సమిష్టిగా పని చేయాలన్నారు. ప్రజలకు ఏదైనా న్యాయమైనా సమస్య ఎదురైతే తనకు ఫోన్ చేయాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేగా గెలుపొంది మొట్ట మొదటి సారిగా వచ్చిన కోనేటి ఆదిమూలంను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించడానికి ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## అలనాటి దొరతనానికి నిదర్శనం నేటి రాజగోపురం

**-ఆదరణకు నోచుకోని పుష్కరిణి**



చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త: శతాబ్దాల తరబడి ఈ ప్రాంతం జమీందారుల ఏలుబడిలో వుండేది. పుంగనూరు కేంద్రంగా జమీందార్లు పాలించేవారు. పలు గ్రామాలు వారిపేరున ఇప్పటికీ పిలువ బడుతున్నాయి. స్థానికంగా వెలసిన శ్రీఅభీష్టద మృత్యుంజయుని ఆలయాన్ని జమీందారు చిక్కరాయలు 600 యేళ్ళ క్రితం నిర్మించారు. అప్పట్లో ఆలయం ముందు 52అడుగుల ధ్వజ స్తంభాన్ని నిలబెట్టలేక జమీందారు చిక్కరాయలు పుంగనూరు వెనుతిరిగాడు. ఆలయ నుంచి కిలో మీటరు దూరం వెళ్ళగానే మార్గం మధ్యలో ఓ బ్రాహ్మణుడు ఎదురుపడి నిరాశతో వెళ్ళొద్దు వెనుతిరిగి చూడమని చెబుతాడు. వెంటనే జమీందారు చూసేసరికి అక్కడ ధ్వజస్తంభం నిలబడివుంటుంది. ఆ వెను వెంటనే బ్రాహ్మణున్ని చేస్తే ఆయన మాయమవుతాడు. సాక్షాత్తు పరమశివుడే ప్రత్యక్షమై ధ్వజ స్తంభాన్ని ఎత్తించాడని బ్రాహ్మణుడు కనిపించిన ప్రదేశంలో పుష్కరిణి తవ్వించి, రాజగోపురాన్ని ఏర్పాటు చేసాడు. ప్రస్తుతం దొరబావిగా పిలువబడుతూ నాటి దొరతనానికి నిదర్శనంగా నిలబడింది. ఆయనచే నిర్మితమైన కోనేరు రాజగోపురం చెక్కుచదరకుండా నాటి పాలకులను గుర్తుకు తెప్పిస్తున్నాయి. కాగా కొందరు స్వార్థ పరులు ఇటీవల గోపురాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం దొరబావికి అతిసమీపంలోనే పోలీస్టేషన్ వుంది. ఎవరైనా ముందుకు వచ్చి చరిత్రకు అద్దం పడుతున్న రాజగోపురం, పుష్కణిలను పునరుద్దరిస్తే భావి తరాలకు దొరబావి చరిత్రను అందించిన వారమవుతామని స్థానికులంటున్నారు.

## విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

**-తలకు బలమైన గాయం... ఆసుపత్రికి తరలింపు**



చిన్నగొట్టిగల్లు, జూన్ 8 ప్రభాతవార్త : స్థానిక మసీదు సమీపంలో ఓ విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకెళితే తెలుగు జాతీయ దినపత్రిక వార్త చిన్నగొట్టిగల్లు మండల రిపోర్టర్ ఇషాద్ అహ్మద్ నమాజ్ కోసం మజీద్‌కు వెళ్ళి తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు తలపై బలంగా కొట్టడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుని, గాయానికి కుట్టు వేయడం జరిగింది. మెరుగైన వైద్యంకోసం కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించారు. కాగా ఇషాద్‌పై దాడి సమాచారం అందుకున్న మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హుటాహుటినా ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

## అభయ వెంకటేశ్వరునికి అలంకారాలు... శనీశ్వరునికి విశేషాభిషాకాలు



శ్రీకాళహస్తి, జూన్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. అంతేకాక శనివారం సందర్భంగా శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. శనివారం ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరోవైపు అతిధులతో కళ కళ లాడింది.

**అనూహ్యంగా పెరిగిన రద్దీ:**

శనివారం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 25 వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతు న్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

**శివానందైక నిలయం జనంతో కిట కిట:**

దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. దక్షిణ కైలాసంలో వెలసిన వాయుటింగేశ్వరుడు భక్తులు తమ ఇష్టదైవం ముక్కంటీశునికి దర్శించుకొని శుభాలు పొందాలని పరుగులు తీశారు. ఓ వైపు సామాన్యభక్తుల తాకిడి మరో వైపు అతిధుల తాకిడితో ఆలయం కిట కిట లాడింది.అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. తమిళనాడు, కర్నాటకల సరిహద్దుల్లో ఉన్న 'దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్త జనంతో కిటకిట లాడింది'. కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులు సమీపంలోని శాంతి సౌఖ్యాల్ని అందించే ముక్కంటీశుని దర్శనానికి తరలి వస్తున్నారు.తిరుమలేశుని సన్నిధికి వచ్చిన భక్తులకు దర్శనం ఆలస్యం కావటంతో సమీపంలోని ముక్కంటీశుని దర్శనానికి విచ్చేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి, సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్సెపెక్టర్ సుదర్శనం, వెంకటముని వారి సహాచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**శనీశ్వరునికి షోడషాభిషేకాలు**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరునికి విశేషంగాషోఢషాభిషేకాలు నిర్వహించారు. దక్షిణభారత దేశంలో ఎక్కడా లేని విధంగా వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసినదివ్యక్షేత్రంలో శనీశ్వరుడు విగ్రహ రూపంలో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనీశ్వరునికి షోఢ షాభిషేకాలు అందించారు. ఈ ఆలయం వద్ద భక్తుల తాకిడి అధికంగా కనబడింది. అయితే దళారుల అట కట్టించుటకు అధికారులుసిసి కెమెరాలను పరిగణలోకి తతీసుకున్నారు.

## వరసిద్దుని దర్శించుకున్న ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ ఎండీ



కాణిపాకం, జూన్ 8 ప్రభాతవార్త: ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ ఎండీ హరిత శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆమెకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కళ్యాణ వేంకటేశ్వరుని ఊంజల్‌సేవ



నారాయణవనం, జూన్ 8 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్నను దర్శించుకున్న ఎంఎల్‌ఏ పులివర్తి దంపతులు

**ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి సాదర స్వాగతం**



చంద్రగిరి, జూన్ 8 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారిని శనివారం ఎంఎల్‌ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్ సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు గావించారు. ఆలయ అర్చకులు పులివర్తి దంపతులకు కుటుంబ సభ్యులపేరిట అర్చనలు జరిపించి, ఆశీర్వదించారు. పడికావలి వద్ద వేదపండితుల వేదాశీర్వాదంతో తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాలలో పురోభివృద్ధి సాధించాలని ప్రార్థించినట్లు తెలిపారు. అంతకుముందు శ్రీనివాస మంగాపురంలో మాజీ సర్పంచ్, టిడిపి ఎస్సీసెల్ కార్యదర్శి బాలసుబ్రమణ్యం, టిడిపి నాయకులు చిరంజీవి, రాజా, మునిరాజ, ఐతేపల్లి దీపక్, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

## ప్రజాతీర్పును స్వాగతిస్తాం..

**అభివృద్ధిని ప్రోత్సహిస్తాం..ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్**



గూడూరు, జూన్ 8 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలలో ప్రజాతీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యే మేరిగ మురళీధర్ అన్నారు. శనివారం సనత్ నగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఎన్నికల ఫలితాలు బాధను కలిగించినా ప్రజాతీర్పును స్వాగతిస్తామన్నారు. సుదీర్ఘంగా రాజకీయాలలో ఉంటూ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, వైసిపి బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. ఇకపై కూడా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసిపి కార్యకర్తల జోలికొస్తే మౌనంగా ఉండబోమన్నారు. న్యాయమైన పోరాటాలు సాగిస్తామన్నారు. అవసరమైతే కోర్టులను కూడా ఆశ్రయిస్తామన్నారు. తిప్పవరప్పాడులో ట్రీ కటింగ్ టెండర్ ప్రక్రియతోనే నిర్వహించారన్నారు. అధికారంలో ఉన్నామని అబద్ధాలను నిజం చేయాలని ప్రయత్నించడం సరికాదన్నారు. హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా పనిచేసుకువెళ్లడమే తన అభిమతమన్నారు. ప్రతిపక్షంలో తనకు కొత్తేమీ కాదన్నారు. రాష్ట్రమంతా ప్రజలు మార్పును కోరుకున్నారు. స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన వాతావరణం కనిపిస్తోందన్నారు. అధికారాన్ని చేతిలోకి తీసుకునే ప్రయత్నం చేస్తే పోరాడుతామన్నారు. వైసిపి ఎంపి అభ్యర్థి గురుమూర్తి గెలుపు సంతృప్తినిచ్చిందన్నారు. వైసిపి పట్టణాధ్యక్షులు బొమ్మిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన ధర్మరాజుల స్వామి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులందరూ రాజీనామాలు చేయనున్నట్లు ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన వారందరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండి మగ్దూమ్ మొహిద్దీన్, రుద్రరాజు, అన్నం మురళీ, మండ్ల రాజేష్, పూర్ణచంద్ర, రఫీ, గోకుల్, శ్రీనాధ్, శశి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## నగరప్రజల్లో భక్తిభావం పెంపొందాలి

**-ఘనంగా నగర సంకీర్తన**



తిరుపతి,జూన్ 8ప్రభాతవార్త: కలియుగంలో ప్రజలు భగవన్నామస్మరణతోనే మంచి జరుగుతుందని, చేసిన పాపాలు తొలగిపోతాయని విశ్వసిస్తూ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో శనివారం చేపట్టే నగర సంకీర్తన కొనసాగింది. శనివారం ఉదయం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి కళాకారులు,భజనమండలి కళాకారులు నుదుటిన తిరునామం ధరించి. భజనలు చేసుకుంటూ వేడుకగా గోవిందనామసంకీర్తన చేశారు. నగరవాసుల్లో భక్తిభావాన్ని చాటారు. రాలయసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, విద్వాన్ కస్వా పద్మనాభం, కెఎన్ రాజా, రెడ్డప్ప, తిరుపాలాచారి, ధనుంజయరెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, ఆటో పద్మనాభం, సాగర్‌రెడ్డి, సుశీల, మహాలక్ష్మి, నరసింహారెడ్డి, నాగరాజు, రాజశేఖర్, కసవనూరు వాసు తదితరులు పాల్గొని భజనలు చేస్తూ గోవింద నామాలతో నగరంలో ఊరేగింపు నిర్వహించారు.

## 'చిలక ముక్కు'కు భలే గిరాకీ



చౌడేపల్లి, జూన్ 8 ప్రభాతవార్త : మామిడిలో చిలకముక్కు(నాటీ రకం)కు మంచి గిరాకీ వుంది. పట్టణంలో పలు చోట్ల ఈ రకం మామిడి అధికంగా అమ్ముడు పోతున్నాయి. సాధారణంగా బేనీసా, మల్లిక మామిడి పండ్లు రుచిగా వుంటాయి. చిలక ముక్కు మామిడి వాటి కంటే రుచిగావుండి మామిడి ప్రియులను నోరూరిస్తునాయి. మామిడి దిగుబడి ఆశాజనికంగా లేకపోవడంతో ఈ రకం మామిడి ధరలకు రెక్కలు వచ్చాయి. అయినా కొనుగోలు చేసేందుకు జనం ఎగబడుతున్నారు.

# తుది శ్వాస వరకు ప్రజలతోనే నా ప్రయాణం

**- తుడా చైర్మెన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన.**
**-మీడియా సమావేశంలో తుడా మాజీ రైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జూన్08 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ...తుది శ్వాస వరకు ప్రజలతోనే నా ప్రయాణం కొనసాగిస్తానని తుడా మాజీ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శనివారం తుమ్మలగుంటలో తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మోహిత్‌రెడ్డి తుడా చైర్మెన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో ఎడాది పాటు ప్రజల్లో ఉంటూ సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేసారు. అతివృష్టి సమయంలో వరదల నుండి ప్రజలను రక్షించటానికి తన తండ్రి చేసిన కష్టాన్ని వివరించారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి, నిస్వార్ధంగా సేవలు అందించామని తెలిపారు. ప్రజల కష్ట, సుఖాలలో తమ కుటుంబం మమేకమై, పండగలకు తమదైన శైలిలలో బహుమతులు అందజేసి, వారి కుటుంబాలలో ఆనందాన్ని నింపామని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో రాష్ట్రంలోనే ఓ రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుటకు రూ.950కోట్ల రుపాయాలతో అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని మీడియాకు వివరించారు. 2022 నుండి చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా 1600 కిలోమీటర్లు గడప గడనకు పాదయాత్ర చేసినట్లు తెలిపారు. గత 20సంవత్సరాలు తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజలతోనే మమేకమై ఉన్నారని, ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి సేవలు అందించినట్లు తెలిపారు. ప్రజలు లక్ష ఓట్లను ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రజా తీర్పుకు శిరసావహిస్తున్నానని, గెలుపు, ఓటమిలు సహజమేనని, గెలిచిన వ్యక్తి ప్రజలకు మరింత సేవ చేయాలని సూచించారు. చంద్రగిరి ప్రజలకు మరింత దగ్గరగా వెళ్ళటానికి కృషి చేస్తానని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. నియోజకవర్గంలో అల్లర్లుకు తావు లేకుండా శాంతిభద్రతలు పరిరక్షించాలని సూచించారు.

